# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి సుందరీకరణ అంశంపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **సింగపూర్ పర్యటనలో భాగంగా రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఘన వ్యర్థాల నిర్వహణను ఈరోజు పరిశీలించారు.**
4. **వైయస్సార్ కడప జిల్లాలో నిర్వహించే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పాల్గొంటారు.**
5. **ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతోన్న నేపథ్యంలో కృష్ణానదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు అంశాలపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధాని సుందరీకరణ, రహదారులు, డివైడర్లు, వంతెనలపై పచ్చదనం ఏర్పాటు వంటి వాటిపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం అమలుపై వ్యవసాయ, ఆర్థిక, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమ విధానం ద్వారా సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి 83 మందికి 61 లక్షల రూపాయల చెక్కులను అందజేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

సింగపూర్‌లో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు ఆ దేశంలో ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్తసేకరణ వాహనాలు, స్వీపింగ్ మెషీన్ల వినియోగం వంటి అంశాలను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పరిశీలించారు. సింగపూర్ అధికారులు ఘన వ్యర్థాల నిర్వహణపై మంత్రికి వివరించారు. ఇళ్లలో చెత్త సేకరణ చేయడం నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ వరకు తీసుకుంటున్న చర్యలను మంత్రి అధ్యయనం చేశారు. పచ్చదనం నిర్వహణ కోసం ఉపయోగిస్తున్న అధునాతన ట్యాంకర్లను మంత్రి పరిశీలించారు.

---------------------------

వైయస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలోని జమ్మలమడుగులో ముఖ్యమంత్రి రేపు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని అనంతరం చేనేత కార్మికులతో సమావేశమవుతారని చెప్పారు. ప్రజా వేదికలో పి4 బంగారు కుటుంబాలతో ముఖాముఖి, అనంతరం ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోటకు వెళ్లి పర్యాటకశాఖ అధికారులతో జరిగే సమావేశమవుతారని కలెక్టర్ తెలిపారు.

---------------------------

పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదలైన 3లక్షల క్యూసెక్కుల వరద నీరు ఈరోజు ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజీని జలవనరులశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రకాశం బ్యారేజీలో ప్రస్తుతం 55 గేట్లను ఒక అడుగు మేర, 15 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 60 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి.. తూర్పు, పశ్చిమ కాలువల ద్వారా 14వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ..27 సెకన్లు

మరో వైపు ప్రకాశం బ్యారేజ్ కి వరద ఉధృతి పెరుగుతోన్న నేపథ్యంలో కృష్ణానదీ పరీవాహక ప్రాంతం, లంకగ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ. మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం, పంట్లు, పడవలతో నదిలో ప్రయాణించడం వంటివి చేయవద్దని సూచించారు. అత్యవసర సహాయం కోసం 1070, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

---------------------------

బిడ్డ ఎదుగుదలకు పోషకాలతో కూడిన తల్లిపాలు అత్యంత అవసరమని శ్రీకాకుళం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ పథక సంచాలకులు ఈ.విమల తెలిపారు. శ్రీకాకుళంలో ఆమె ఈ రోజు మాట్లాడుతూ, తల్లిపాలు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రేపటి నుండి ఏడో తేదీ వరకు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలో 16 అంగన్వాడి ప్రాజెక్టుల పరిధిలో సుమారు 3 వేల 6 వందల కేంద్రాల్లో ఈ వారోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె తెలియజేస్తూ,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రోజు నెల్లూరులో పర్యటించారు. ఇందులో భాగంగా నెల్లూరులోని కేంద్ర కారాగారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ ద్వారా సమావేశమైయ్యారు. అనంతరం నెల్లూరు నగరంలోని ఆ పార్టీ నాయకులు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 130 పాయింట్ల లాభంతో 81 వేల 612 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 39 పాయింట్ల లాభంతో 24 వేల 894 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

====================